# గిరిజన స్త్రీలను దగాచేస్తున్న చట్టం

వెంపాగంగమ్మ, గిరిజనస్త్రీ. ఈమె తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం దగ్గర్లోని ఇర్లపల్లి గ్రామవాసి దాదాపు 15 సంవత్సరాల క్రితం గంగమ్మ గోకవరం గ్రామానికి చెందిన గిరిజనేతర కాంట్రాక్టరు 'కలిసి' బోర్నగూడెంలో జీవించారు. వీరిద్దరికీ అంధుడైన ఒక కొడుకు పుట్టాడు. అయితే కాంట్రాక్టరు గంగమ్మను, ఆకొడుకును వదిలేసి గోకవరం నుంచి వెళ్ళిపోయాడు. కాంట్రాక్టరు ఆచూకి కోసం గంగమ్మ చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. సబ్‌డివిజనల్ మెజిస్ట్రేటు కోర్టులో గంగమ్మ పిటిషను దాఖలు చేసింది. సబ్‌డివిజనల్ మెజిస్ట్రేటు గంగమ్మకు రు.300/-, అంధుడైన ఆమె కొడుక్కి రు 200/- జీవనభృతిగా కాంట్రాక్టరు నెలనెలి చెల్లించాలని తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలుచేస్తూ కాంట్రాక్టరు జిల్లా కోర్టులో దరఖాస్తు చేసుకున్నాడు. చట్టబద్దంగా కాంట్రాక్టరు గంగమ్మ భార్యాభర్త కారని, అందువల్ల సబ్‌డివిజనల్ మెజిస్ట్రేట్ తీర్పు చెల్లదని జిల్లా కోర్టు కొత్త తీర్పునిచ్చింది. బలియమైన సాక్ష్యాలు ఏమీ లేనందువల్ల తానేమీ చేయలేనని గంగమ్మ తరపు న్యాయవాది చేతులెత్తేశాడు. ఐతే గంగమ్మ మాత్రం పట్టువదల్లేదు. తన సమస్యను గూర్చి జిల్లాకోర్టు పూర్తిగా విషయసేకరణ చేయలేదని, గిరిజనుల ఆచార, వ్యవహారాలు అర్థంచేసుకోకుండా జిల్లా కోర్టు తీర్పు చెప్పిందని, ఈ తీర్పు చెల్లదని రాష్ట్ర హైకోర్టులో గంగమ్మ రిట్‌పిటిషన్ దాఖలు చేసింది. గిరిజనుల్లో వివాహానికి సంబంధించి చట్టపరమైన పద్ధతులు అమల్లోలేవని, పురుషుడు గిరిజనేతరుడైతే వాళ్ళ మధ్య వివాహమే అవసరం లేదని, వాళ్ళను గిరిజన సంఘం పెద్దలు భార్యాభర్తలుగా గుర్తిస్తే చాలునని గంగమ్మ తన రిట్‌పిటిషన్‌లో పేర్కొంది. ఇటువంటి ఆచారం ఉన్నందువల్ల తాను చట్టపరమైన సాక్ష్యాలు చూపించలేనని తనకు న్యాయం చెయ్యమని ఆమె కోరుతుంది. కేసు ప్రస్తుతం రాష్ట్ర హైకోర్టులో పెండింగ్‌లో ఉంది.

ఇలాంటిదే మరొక కేసులో కోర్టు గిరిజనుల వివాహ సంప్రదాయాన్ని అర్థం చేసుకోలేక పోగా, గిరిజన స్త్రీలను ఉంపుడుగత్తెలుగా అభివర్ణించి, వారికి భర్త జీవనభృతి కల్పించాల్సిన అవసరం లేదని తీర్పు ఇచ్చింది. మారేడుమిల్లికి చెందిన మాట్ల లక్ష్మి తన భర్త నుంచి జీవనభృతి ఇప్పించమని కోరుతూ జిల్లా కోర్టులో, పిటిషను పెట్టగా, జిల్లా కోర్టు క్రింది కోర్టుకు ఈ వ్యవహారాన్ని అప్పగించి చేతులు దులుపుకుంది.

గిరిజన స్త్రీలు, గిరిజనేతర పురుషుల మధ్య వివాహానికే కాక కోర్టులు గిరిజనుల మధ్య వివాహాలకు కూడ చట్టబద్ధమైన సాక్ష్యాలు కావాలని గిరిజనుల సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను పరోక్షంగా గేలి చేస్తున్నాయి.

రంపచోడవరం మండల పరిధిలోని గిన్నెపల్లి గ్రామస్తురాలు లలిత తన భర్త (ఇద్దరూ గిరిజనులే) నుండి జీవనభృతికై ఆస్తిలో వాటా కావాలని కోర్టుకు విన్నవించుకొంది. ఐతే లలిత భర్త తరపు న్యాయవాది, లలితకు ముందే వేరొక వ్యక్తితో పెళ్ళి అయిందని, ఆ పెళ్ళి "చట్టబద్ధంగా" రద్దు కానందువల్ల ప్రస్తుత భర్త చట్టపరంగా ఆమెకు భర్తకాడ"ని, కనుక లలితకు అతని ఆస్తిలో వాటా ఇవ్వవలసిన అవసరం లేదని వాదిస్తున్నాడు. ఉంపుడుగత్తెగా ఒక స్త్రీ ఎంతకాలం కలిసి జీవించినా ఆమెకు పురుషుని ఆస్తిలో వాటా కాని, జీవన భృతి కాని అడిగే హక్కులేదని ఆ న్యాయవాది అంటున్నాడు.

ఎంతో మంది గిరిజన స్త్రీలు ఈ రకంగా అవమానాలకు గురౌతున్నారు. న్యాయం చేయమని వీరు కోర్టులను ఆశ్రయించితే, కోర్టులు న్యాయం చెయ్యకపోగా, వీళ్ళను ఉంపుడుగత్తెలుగా, వేశ్యలుగా చిత్రించి కేసులను 4,5 సంవత్సరాలు వరకు పెండింగులో ఉంచుతున్నాయి. ఉంచుకున్న వాళ్ళు, కలిసి జీవిస్తున్న చట్టపరంగా భార్యలు కారని న్యాయశాస్త్రం, గౌరవ న్యాయమూర్తులు, న్యాయవాదులు గిరిజన సంస్కృతిని, సాంప్రదాయాల్ని గేలిచేస్తున్నారు.. కాని ఏ రకంగానైనా స్త్రీ పురుషునితో కలిసి జీవించడం సక్రమమేనని గిరిజన సాంప్రదాయం అంగీకరిస్తోంది.

గిరిజనుల ఆచారాలను, సాంప్రదాయాలను గిరిజనేతరులు అపహాస్యం చేస్తున్నారు. వారి సంస్కృతిని గేలి చేస్తున్నారు. గిరిజనుల దృష్టిలో 'కలిసి జీవించడం" వివాహ జీవితంతో సమానం. అయితే స్వార్థపరులైన కొందరు గిరిజనేతరులు ఈ సాంప్రదాయాన్ని అడ్డం పెట్టుకొని గిరిజన స్త్రీలతో గడిపి ఆ తర్వాత వారిని వదలేస్తున్నారు. పైగా ఆ స్త్రీలు తమకు ఉంపుడుగత్తెలని, సమాజానికి వేశ్యలని నిర్లజ్జగా చెప్తున్నారు. కోర్టులు సహితం వీళ్ళకు వంత పలుకుతూ గిరిజన స్త్రీలను మోసం చేస్తున్నాయి. ఇది కేవలం గిరిజనస్త్రీలకు జరుగుతున్న అన్యాయమే కాదు, మొత్తం గిరిజన వ్యవస్థకు జరుగుతున్న అన్యాయం.

ఇంకో రకంగా మొత్తం మహిళా జాతికే జరుగుతున్న అన్యాయం. తాము నాగరీకులమని బొంకుతున్న గిరిజనేతరులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు, అనాగరికంగా, మృగాలకంటే హీనంగా గిరిజన వ్యవస్థను కించపరుస్తున్నారు. స్త్రీని తన కామవాంఛ తీర్చుకునేందుకు వాడుకొని, ఆ తర్వాత ఆమెను ఉంపుడుగత్తెగా వేశ్యగా ప్రకటించే హక్కు పురుషునికి ఎక్కడిది?

ఈ అవమానాలకు, దోపిడీకి, మోసానికి గురికాకుండా తమని తాము రక్షించుకునేందుకు గిరిజనులు ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు సంబంధించిన చరిత్ర ఏమిటో, తమ జీవన విధానం ఎటువంటిదో తెలుసుకోటానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

— శక్తి ( స్వచ్ఛంద సంస్థ)
తూర్పుగోదావరి జిల్లా